# సింగిల్ పేజీ కథలు



## గుణపాఠం

**స్కూల్ టీచర్‌గా పనిచేసి రిటైర్ అయిపోయాడు శంకరం మాస్టారు. ఆయనకు సహధర్మచారిణిగా తన జీవితాన్ని పండించుకుంటోంది భవాని. వాళ్ల ఒక్కగానొక్క కూతురే జ్యోత్స్న.**

గ్రాడ్యుయేషన్‌తో పాటే వెంటనే పీజీ కూడా పూర్తిచేసేసి.. జూనియర్ లెక్చరర్‌గా జాబ్ కొట్టేసింది కూడా!

ఇంటి పనులూ..వంటపనుల్లాంటివన్నీ తల్లీకూతుళ్లిద్దరూ కలిసి టకటకా పూర్తి చేసేసుకుంటారు. జ్యోత్స్న కాలేజీకి వెళ్లిపోగానే పెద్దోళ్లిద్దరూ పత్రికలూ.. పుస్తకాల్తూ తిరగేయడం... ఆ తర్వాత కులాసాగా కొంతసేపు కబుర్లు చెప్పుకోవడం... టీవీలో సీరియల్స్ చూడడంతో సాయంత్రం దాకా గడిపేస్తారు.

జ్యోత్స్న కాలేజీ నుండి ఇంటికి వచ్చేసిందంటే... ఆ ఇంట్లో ఉన్నది ముగ్గురే అయినా ఆ ఇల్లంతా ఎంతో సందడిగా ఉంటుంది!

* * *

"అమ్మాయిని ఆ..డ..పి..ల్ల..గా మనమేనాడూ చూడలేదు. చక్కగా చదివించాం. కష్టపడి చదువుకుంది. ఉద్యోగం సంపాదించింది కూడానూ! ఇప్పటికైనా..." భర్త మనోభావాన్ని గ్రహించిన భవాని.

"అవునండీ! ఒక్కగానొక్క కూతురికీ పెళ్లంటూ చేసేస్తే కృష్ణా.. రామా.. అనుకుంటూ శేషజీవితాన్ని గడిపేయొచ్చు"

"నిజమే.. ఎంతయినా ఆ..డ..పి..ల్ల.. కదా! ఎన్నాళ్లని మనింట్లో ఉంచుకుంటాం చెప్పు?"

"ఆడపిల్లకి పెళ్లిచేయడం సంబరమే.. అలాగే అప్పగింతల సమయం ఎంతటి పాషాణ హృదయాలైనా ద్రవీభవించక మానవు.. ఆ తర్వాత కూతురూ.. అల్లుడూ పండగలకీ.. పబ్బాలకీ వస్తుంటారు.. వెళ్తుంటారు. పెట్టుపోతలకంటూ మనకా దేవుడిచ్చింది చాలు. ఇకమీదటైనా అమ్మాయికి సంబంధాలు చూడండి! మంచి సంబంధం అంటూ దొరికితే ఈ శ్రావణమాసంలో చేసేద్దాం.. ఏమంటారు?" చిరునవ్వును బదులిచ్చాడు శంకరం మాస్టారు.

* * *

పెళ్లిచూపుల సీన్ అయిపోయింది. తాంబూలాలు పుచ్చుకోడానికి మంచి రోజు చూసుకుని వస్తామంటూ ఆ వచ్చినవాళ్లు వెళ్లిపోయారు.

"జ్యోత్స్నా! ఈ రోజేనమ్మా.. తాంబూలాలు పుచ్చుకోడానికి వాళ్లొచ్చేది!" ఆశ్చర్యానందాలు తొణికిసలాడాయి శంకరం మాస్టారి ముఖంలో ప్రస్ఫుటంగా!

"ఈ రోజు కూడా కాలేజీకి వెళ్లాలా చెప్పు..? పెళ్లివారొచ్చేది ఈ సాయంకాలమే. అయినా ఈ ఒక్కరోజూ వెళ్లకపోతే వచ్చే నష్టమేంటమ్మా?" జాలిగా ముఖం పెట్టి అడిగింది భవాని అభ్యర్థనా పూర్వకంగా!

"ఈ రోజు తప్పనిసరిగా వెళ్లాలమ్మా!" పాఠాలు చెప్పే పంతులమ్మ 'గుణపాఠం' చెప్పడానికే వెళుతోందని భవానికి తెలిసే ఛాన్సే లేదు మరి.

* * *

వారం పదిరోజుల పాటు "ఇతడినెక్కడో చూసినట్లుందే" అనుకుంటూ బాగా ఆలోచించి- గతుక్కుమంది జ్యోత్స్న.

"దొంగతనాలూ..దోపిడీలూ..చేస్తూ చట్టానికి దొరక్కుండా తిరుగుతున్న వీడికి ఇప్పుడు పెళ్లి కావాల్సి వచ్చిందా!? అంటే ఇప్పటికే ఎంతమందిని పెళ్లాడి ఉంటాడో? వాళ్లనే పాపకూపంలోకి నెట్టేసి ఉంటాడో!? లేదా అవయవాలతో వ్యాపారం కూడా చేస్తున్నాడా?"

ఇలా పరిపరి విధాలుగా పరుగిడుతోంది జ్యోత్స్న మనసు.

వాడి బిజినెస్ ఏంటో పూర్తిగా అర్థమైపోయిందామెకు. రెండేళ్ల క్రితం తను పీజీ చేస్తున్నప్పుడు కొంతమంది దుండగులతో క్లాస్‌రూమ్‌లోకి దూసుకొచ్చి.. కత్తులతో బెదిరించి మరి.. అందరి మెడల్లోని గోల్డ్‌చైన్‌లు కాజేసి... "పోలీస్ కంప్లైంట్ చేస్తే మీ ప్రాణాలకే ముప్పు.. జా...గ్ర...త్త..." అంటూ బెదిరించిపోయింది ఈ మహానుభావుడే! సందేహం లేదు అనుకుంది.

సాయంత్రం మామూలుగా ఐదో గంటకల్లా జ్యోత్స్న ఇంటికొచ్చేసింది.

"పెళ్లివారు తాంబూలాలిచ్చి పుచ్చుకోడానికి వస్తారు. నువ్వు తొందరగా రడీ కావమ్మా.." అమ్మానాన్నలకు చిరునవ్వును బదులిచ్చింది.

"ఏ టైమ్‌కొచ్చేదీ ఫోన్ ఏమైనా వచ్చిందామ్మా..?" అడిగింది ఎంతో అమాయకంగా ముఖం పెట్టి.

"లేదమ్మా!" రెండు గొంతులూ జత కలిపాయి.

"పోనీ..మీరైనా చెయ్యొచ్చుగా?"

"చేసాం..రాం..గ్..నం..బ..ర్.." అంటూ పెట్టేశారు" వాపోయారా దంపతులు.

ఆ తర్వాత తెలిసింది వాళ్లకు....

వాడు దుర్మార్గుడనీ.. కూతురే స్టూడెంట్స్ సహాయంతో వాణ్ని చట్టానికి పట్టిచ్చిందనీనూ...!

ఎంత విజ్ఞతతో వాస్తవ సమాచారాన్ని పూర్తిగా గ్రహించాకనే అన్ని విధాలుగా తగినవాడైతేనే తప్ప.. ఆడపిల్ల పెళ్లి విషయంలో తొందరపాటు ఎంతమాత్రం తగదని 'గుణపాఠం' నేర్చుకున్నాడు భవానీ శంకరం మాస్టారు.

-కొడుకుల సూర్యసుబ్రహ్మణ్యం
(జగిత్యాల)